నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
ఆదిలాబాద్
బుధవారం | మార్చి 27, 2024 | www.navatelangana.com

బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-కౌటాల



నదీమాబాద్‌కు చెందిన నలుగురు యువకులు తాటిపెల్లి సమీపంలో వార్ధ నదిలో ఈతకు వెళ్లి మృతి చెందిన కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, జెడ్పీ ఇన్‌చార్జి చైర్మన్ కోనేరు కృష్ణారావు మంగళవారం పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. అధైర్య పడొద్దని, అన్ని విధాలుగా ఆదుకుంటామని బాధితులకు ధైర్యం చెప్పారు. వారి వెంట పలువురు మండలస్థాయి నాయకులు ఉన్నారు.

ఎస్పీని కలిసిన డిపో మేనేజర్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆర్టీసీ డిపో మేనేజర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన విశ్వనాథ్ ఎస్పీ సురేష్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా జిల్లాలో వెనుకబడిన ప్రాంతాలకు బస్సు సౌకర్యం కల్పించడంపై చర్చించారు. డిఎం విశ్వనాథ్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో బస్టాండ్ ఆవరణలో ట్రాఫిక్ నియంత్రణ కోసం ప్రత్యేకంగా పోలీసులను నియమించాలని కోరారు. మహాలక్ష్మి పథకం ద్వారా ప్రయాణికులకు అందిస్తున్న సేవలను వివరించారు. ఎన్నికల తర్వాత కానిస్టేబుళ్లను నియమిస్తానని ఎస్పీ తెలిపినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డిపో సూపరింటెండెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



వ్యాపార నిర్వహణపై అవగాహన కలిగి ఉండాలి

- ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనరసింహం



నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

వ్యాపార నిర్వహణపై విద్యార్థులు ప్రాథమిక అవగాహన కలిగి ఉండాలని కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనరసింహం తెలిపారు. కళాశాలలో మంగళవారం సిర్పూర్ పేపర్ మిల్ ఆధ్వర్యంలో భారతీయ యువశక్తి ట్రస్ట్ వారు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని కామర్స్ విద్యార్థులకు వ్యాపార నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు ఇలాంటి సదస్సుల వల్ల భవిష్యత్తులో పారిశ్రామికవేత్తలుగా, వ్యాపారవేత్తలుగా ఎదగడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. విద్యార్థులు డిగ్రీ పూర్తి చేసిన తర్వాత స్వయంగా ఉపాధి పొందడానికి భారతీయ యువ శక్తి ట్రస్ట్ వారికి కావాల్సిన వనరులను సమకూర్చడంలో ఎంతగానో సహకరిస్తుందని తెలిపారు. ముఖ్యంగా ఒక పరిశ్రమ లేదా వ్యాపారం ప్రారంభించడానికి ఈ ట్రస్ట్ తరపున ప్రణాళిక సిద్ధం చేయడంతో పాటు బ్యాంకు రుణాలను అందించడంలోనూ తగిన కృషి చేస్తుందని వివరించారు. అనంతరం ఇటీవల కొత్తగా వివిధ వ్యాపారాలు ప్రారంభించిన వారు వారి అనుభవాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో భారతీయ యువశక్తి ట్రస్ట్ ప్రతినిధులు కునాల్, శంకర్, కామర్స్ సీనియర్ అధ్యాపకులు రాజు పాల్గొన్నారు.

భగీరథ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మిషన్ భగీరథ కాంట్రాక్టు కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించడంతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్ డిమాండ్ చేశారు. మంగళవారం కార్మికులతో కలిసి భగీరథ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల 3నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కార్మికుల వేతనాలను ప్రతినెల ఇవ్వాలని, వేతనాల జీవోలను సవరించి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు ఇవ్వాలని, ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని, అర్హులైన కార్మికులకు ప్రమోషన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్, వాంకిడి మండలాల కార్మికులు బాలేష్, హరీష్, వినేష్, మహేష్, సోహెల్, ప్రకాశ్, రమేశ్, సురేష్, అనీల్, వెంకటేష్, సునిల్, భాస్కర్, ప్రభాకర్ పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన దివ్యాంగులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎస్పీ గౌస్ ఆలంను హ్యాండీక్యాప్ హెల్పింగ్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు మంగళవారం డిపిఓ కార్యాలయంలో కలిశారు. ఇటీవల ఓ దివ్యాంగుడిని కించపరిచిన వ్యక్తిపై ఫిర్యాదు చేశారు. దివ్యాంగుల చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. ఈ విషయాలపై ఎస్పీ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు ఇమ్రాన్, ప్రధాన కార్యదర్శి ఫైసల్ అహ్మద్, షోయబ్, రిత్విక్ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-కౌటాల

విద్యుత్ సరఫరాలో బుధవారం అంతరాయం ఏర్పడనున్నట్టు విద్యుత్ శాఖ ఏఈ రవీందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కౌటాల సబ్‌స్టేషన్ పరిధిలోని చీపురుదుబ్బ ఫీడర్‌లో ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4.30 గంటల వరకు 11 కేవీ మరమ్మత్తులు చేయనున్న కారణంగా గురుడుపేట, కన్నెపెల్లి, బోదంపెల్లి, కనిఖీ, యాపలగూడ గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు తమకు సహకరించాలని కోరారు.

ఎన్నికల యాప్‌లను వినియోగించుకోవాలి

- రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో భారత ఎన్నికల సంఘం నిర్వహించే ఎన్నికల యాప్‌లను రాజకీయ పార్టీలు వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్లు(స్థానిక సంస్థలు) దీపక్ తివారి, రెవెన్యూ దాసరి వేణు, జిల్లా రెవెన్యూ అధికారి లోకేశ్వర్‌తో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంతమైన ఎన్నికల నిర్వహణ కొరకు రూపొందించిన ప్రత్యేక ఎన్నికల యాప్‌లు సువిధ, సి-విజిల్, 1950ను ఉపయోగించుకోవాలని, ఎన్నికల నిర్వహణలో అభ్యంతరాలు, నిబంధనలకు ఉల్లంఘనపై ఫిర్యాదులు, ఇతర ఎన్నికల సంబంధిత సమస్యలపై యాప్‌లలో, కంట్రోల్ రూమ్‌లో సంప్రదించవచ్చని తెలిపారు. ప్రచార సంబంధిత అనుమతుల జారీ కొరకు ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన మీడియా సెంటర్, మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీలలో సంప్రదించవచ్చని, ప్రింట్ మీడియాలో పెయిడ్ న్యూస్ పర్యవేక్షణ జరుగుతుందని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ నెం.08733-279033 ఏర్పాటు చేయడం జరిగిందని, ఫిర్యాదులు, సమస్యలు, వివరాల కొరకు సంప్రదించవచ్చని తెలిపారు. జిల్లాకు సంబంధించి త్వరలో ప్రచార సంబంధిత అంశాల రేట్ చార్ట్ రూపొందించడం జరుగుతుందని, జిల్లాకు త్వరలో వ్యయ పరిశీలకులు, సాధారణ పరిశీలకులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఏప్రిల్ 3న ఉదయం 11 గంటలకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మొదటి దశ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ర్యాండమైజేషన్ ఉంటుందని తెలిపారు. జిల్లాలో అంతర్ రాష్ట్ర సరిహద్దు గ్రామాలైన కెరమెరి మండలంలోని 12 గ్రామాలలో ఓటరు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, ఈ విషయమై విస్తృత ప్రచారం చేపట్టాలని తెలిపారు. భారత ఎన్నికల సంఘం నియమ నిబంధనల ప్రకారం ప్రతి ఒక్కరు స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకునేలా ప్రజలలో చైతన్యం తీసుకురావాలని తెలిపారు. నూతన ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 1, 2024 తేదీ ప్రామాణికంగా ఏప్రిల్ 15వ తేదీ వరకు ఫారం 6 ద్వారా నూతన ఓటరు నమోదు, మార్పులు, సవరణలు, తొలగింపుల కొరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో ఫారం 6 ద్వారా 3 వేల 659 దరఖాస్తులు, ఫారం 8 (చిరునామా మార్పు) ద్వారా 359 దరఖాస్తులు, ఫారం 7 ద్వారా 2 వేల 371 దరఖాస్తులు, ఫారం 8 (సవరణలు) ద్వారా 2 వేల 281 దరఖాస్తులు రావడం జరిగిందని, నిర్ణీత గడువులోగా పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మే 13న జిల్లాలో పూర్తి స్థాయిలో పోలింగ్ జరిగేలా అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. నామినేషన్లు, ప్రచారం ఇతరత్రా ఎన్నికల సంబంధిత విషయాలలో రాజకీయ పార్టీలు ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్ దేశ్ పాండే, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు మధుకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, పక్కన అదనపు కలెక్టర్లు



పాల్గొన్న వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు

స్టాక్ రిజిస్టర్ సక్రమంగా నిర్వహించాలి

నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్



ఎరువులు, విత్తన దుకాణాల డీలర్లు స్టాక్ రిజిస్టర్ సక్రమంగా నిర్వహించాలని కాగజ్‌నగర్ మండల వ్యవసాయాధికారి రామక్రిష్ణ సూచించారు. మంగళవారం స్థానిక ఎరువులు, విత్తనాలు, పురుగుమందు దుకాణాలను తనిఖీ చేశారు. విత్తనాలు, ఎరువుల స్టాక్‌ను, రికార్డులను పరిశీలించారు. విత్తనాలకు సంబంధించిన బిల్లు బుక్కులను, డెలివరి చలాన్‌లను, మార్కెటింగ్ అగ్రిమెంట్, వచ్చిన స్టాక్, అమ్మిన స్టాక్ వాటి లెక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ఫెర్టిలైజర్ దుకాణాల వారు విధిగా స్టాక్స్ బోర్డును ఏర్పాటు చేయాలని సూచించారు. డీలర్లు ఫర్టిలైజర్ స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు ఈపాస్ మిషన్‌లో నమోదు చేయాలని, గోదాంలోని స్టాక్ ఈ పాస్ స్టాక్ సమానంగా ఉండాలని సూచించారు. నకిలీ, కాలం చెల్లిన విత్తనాలు విక్రయించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇలాంటి విత్తనాలు అమ్మిన వారిపై పీడీ యాక్టులు నమోదు చేస్తామని తెలిపారు. రైతులు డీలర్ల వద్ద కొనుగోలు చేసే విత్తనాలు, ఎరువులకు సంబంధించిన రశీదులను విధిగా తీసుకోవాలని సూచించారు. ఈ రశీదులను పంట కాలం పూర్తి అయ్యే వరకు రైతులు భద్రంగా దాచిపెట్టుకోవాలని అన్నారు. పంట నష్టపరిహారం కావాలంటే ఈ రశీదులు తప్పని సరి అని అన్నారు. అనంతరం పలు ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాలను తనిఖీ చేశారు. ఎవరైన నకిలీ విత్తనాలు దిగుమతి చేసుకుంటే పోలీసులకు, వ్యవసాయాధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు.

వరి ధాన్యం ఆఖరి గింజ వరకూ కొనుగోలు చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రైతుల వద్ద నుండి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని ఆఖరి గింజ వరకు కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుండి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, వ్యవసాయ, పౌర సరఫరాల శాఖల అధికారులతో వరి ధాన్యం కొనుగోలు, తాగునీటి సరఫరాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుండి వరి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. వరి ధాన్యం విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతుల సౌకర్యార్థం పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయాలని, వేసవి అయినందున నీడ, తాగునీరు ఇతర సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. ప్రజలకు ఎలాంటి నీటి ఎద్దడి సమస్య లేకుండా సరఫరాకు అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. కలెక్టర్ వెంకటేష్ ధోత్రే మాట్లాడుతూ రబీ సీజన్ వరి ధాన్యం కొనుగోలు కొరకు జిల్లాలో పౌరసరఫరాల శాఖ, ఐకెపి ఆధ్వర్యంలో 37 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. నీడ కొరకు షామియానా, తాగునీటి సౌకర్యాలు ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన టార్పాలిన్లను అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద వ్యవసాయ, వ్యవసాయ విస్తరణ అధికారులతో పర్యవేక్షించే విధంగా ఏర్పాట్లు చేయడం జరిగిందని, ధాన్యం తూకం జరిగిన వెంటనే మిల్లులకు తరలించే విధంగా చర్యలు చేపడుతున్నామని, గన్ని సంచుల ఏర్పాటుతో పాటు సరిహద్దు చెక్ పోస్టులను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. వేసవిలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా కార్యాచరణ రూపొందించడం జరిగిందని, జిల్లాలోని 2 మున్సిపాలిటీలు, 334 గ్రామపంచాయతీలలో తాగునీటి సరఫరాకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్‌రావు, పౌరసరఫరాల శాఖ అధికారులు తారామణి, నర్సింగరావు, జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతిగౌడ్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణపై డీఎస్పీకి ఫిర్యాదు



డీఎస్పీకి ఫిర్యాదు చేసేందుకు వచ్చిన ఇట్యాల గ్రామస్తులు

కాగజ్‌నగర్ : దహెగాం మండలం ఇట్యాల గ్రామ శివారులోని తమ పదెకరాల భూమిని ఇతరులు ఆక్రమించుకొని పంటను నాశనం చేశారంటూ మంగళవారం బాధితులు కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్‌కు ఫిర్యాదు చేశారు. బాధితురాలు సందెల లక్ష్మితో పాటు ఆమె వారసులు, గ్రామస్థులు ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు దృష్టికి సమస్యను తీసుకుపోగా డీఎస్పీకి ఫిర్యాదు చేయాలని ఆయన సూచించడంతో బీజేపీ నాయకులు పాల్వాయి సుధాకర్‌రావు ఆధ్వర్యంలో బాధితులు డీఎస్పీ కార్యాలయానికి వెళ్లి జరిగిన అన్యాయం గురించి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నదీనాలా కింద తమకు వచ్చిన భూమిని 50 ఏళ్ల నుండి సాగు చేసుకుంటున్నామని, 2007లో ఇతరులు భూమిని ఆక్రమించుకునేందుకు ప్రయత్నించగా కోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. 2012లో కోర్టు ద్వారా ఇంజక్షన్ డిక్రీ వచ్చిందనీ, అప్పటి నుండి భూమిని తామే సాగు చేసుకుంటున్నామని తెలిపారు. ప్రస్తుతం మళ్లీ కాగజ్‌నగర్ మండలం కోసిని పంచాయతీ పరిధిలోని పర్ధాన్‌గూడకు చెందిన ఆరుగురు వ్యక్తులు భూమిని ఆక్రమించుకొని తాము సాగు చేసిన పంటను నాశనం చేసినట్లు తెలిపారు. దీనిపై తమకు న్యాయం చేయాలని డీఎస్పీని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారని వారు వివరించారు. వీరి వెంట బీజేపీ నాయకులు ఈర్ల విశ్వేశ్వర్‌రావు, సిందం శ్రీనివాస్, కొంగ సత్యనారాయణ, డి శ్రీనివాస్, వీరభద్రచారి, దోని శ్రీశైలం, గ్రామస్థులు ఉన్నారు.

ఆర్‌ఎంపీ అందించిన చికిత్సపై విచారణ



దహెగాం : మండల కేంద్రానికి చెందిన గాదె నీలక్క మూడు రోజుల క్రితం వైద్యం వికటించి మృతి చెందినట్టు జిల్లా వైద్యాధికారికి ఫిర్యాదు అందడంతో ఆర్‌ఎంపీ అనల లక్ష్మణ్ చేసిన వైద్యంపై ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు స్పందన మంగళవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా వైద్యాధికారికి ఫిర్యాదు అందడంతో విచారణ చేపట్టాలని ఆదేశించగా శ్రీ ఆంజనేయ పేరు గల క్లినిక్ వద్దకు విచారణకు వెళ్లగా ఆర్‌ఎంపీ లక్ష్మణ్ అందుబాటులో లేరని అన్నారు. మారుతి డయోగ్నోస్టిక్ సెంటర్‌లో ఏమైన వైద్య పరీక్షలు నిర్వహించారా అని విచారణ చేపట్టారు. డయోగ్నోస్టిక్ సెంటర్ నిర్వాహకుడు రాజేష్ తన వద్ద మృతురాలు వైద్య పరీక్షల నిమిత్తం రాలేదని రాతపూర్వకంగా రాసి ఇచ్చినట్టు పేర్కొన్నారు. త్వరలోనే పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి జిల్లా వైద్యాధికారికి అందజేస్తానని ఆమె పేర్కొన్నారు.

ఉచిత కంటి పరీక్షా శిబిరానికి స్పందన



కాగజ్‌నగర్ : శ్రీ కొత్తపల్లి వెంటకలక్ష్మి-చంద్రయ్య మెమోరియల్ సర్వీసు సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కిమ్స్ ఆసుపత్రిలో ఉచిత కంటి పరీక్షా శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి 29 మంది హాజరు కాగా, ఇందులో 15 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వీరికి లయన్స్‌క్లబ్ ఆఫ్ బెల్లంపల్లి వారి సహకారంతో ఉచితంగా ఆపరేషన్లు చేయించనున్నట్లు సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్-అనిత దంపతులు తెలిపారు. ప్రతీ మంగళవారం నిర్వహించే ఈ ఉచిత కంటి పరీక్షా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి



కౌటాల : మూగజీవాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని పశు వైద్యాధికారి శ్రీకాంత్ అన్నారు. మంగళవారం మండలంలోని వీర్దండి గ్రామంలో ఉచిత పశు వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పశువులకు గాలికుంటు నివారణ వ్యాధి టీకాలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పశువులకు ఎలాంటి వ్యాధులు సోకిన తమకు సమాచారం అందించాలన్నారు. ఇంటికొచ్చి ఉచితంగా వైద్యమిందిస్తానన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో వచ్చే నెల 15 వరకు శిబిరాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆయన వెంట సిబ్బంది సందీప్, ప్రకాష్, భిక్షపతి, రాజన్న, శోభన్ ఉన్నారు.

అవగాహన సదస్సులు నిర్వహించాలి

కాగజ్‌నగర్ : వృద్ధులకు ప్రతీ మూడు నెలలకోసారి చట్టాలపై అవగాహన సదస్సులు నిర్వహించాలని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ కోరారు. మంగళవారం జిల్లా సంక్షేమాధికారికి వినతిపత్రం ఇచ్చారు. నిబంధనల ప్రకారం ప్రతీ మూడు నెలలకోసారి వృద్ధులకు వారికున్న చట్టాలు, స్థితిగతులు, వైద్య సదుపాయాలపై అవగాహన కల్పించాల్సి ఉంటుందని అన్నారు. ఇది జిల్లాలో అమలు కావడం లేదని, ఇప్పటికైనా అధికారులు దీనిని అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సభ్యులు పూర్ణచందర్‌రావు, నారాయణ, కలికోట రమణయ్య, మురళీధర్‌రావు, ఎల్లాగౌడ్, వాహబ్, మూర్తి, పుర్క సీతారాం, జగదీశ్వర్, కుడిక్యాల బాలరాజు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
ఆదిలాబాద్-నిర్మల్
బుధవారం | మార్చి 27, 2024 | www.navatelangana.com

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

నవతెలంగాణ-ఉట్నూర్



ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఈఓ శంకర్ అన్నారు. మంగళవారం ఆయన ఉట్నూర్ గ్రామపంచాయతీలోని ఆయా వార్డుల్లోని మురుగు కాలువలను పరిశుభ్రం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ముందస్తు జాగ్రత చర్యల్లో భాగంగా మురుగు కాలువలను శుభ్రం చేస్తున్నామని అన్నారు. దీని వల్ల దోమలు వృద్ధి చెందకుండా ఉంటుందని అన్నారు. దోమలు వృద్ధిచెందితే రోగాలు వ్యాప్తి చెందుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానితులకు లెప్రసీ పరీక్షలు

నవతెలంగాణ-నార్నూర్



మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం అనుమానితులకు ఆరుగురికి డీపీఎంఓ రమేష్ లెప్రసీ పరీక్షలు నిర్వహించారు. కుష్టువ్యాధి కాదని భయపడాల్సిన అవసరం లేదని సూచించారు. పరీక్షలు నిర్వహించిన అనంతరం మందులు పంపిణీ చేశారు. వారి వెంట లెప్రసీ నోడల్ అధికారి చౌహాన్ చరణ్‌దాస్, వైద్య సిబ్బంది గోకుల్, హిమబిందు, ప్రియాంక, మాన్కుబాయి, విమల, సరిత, భోజుబాయి ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో పైపులు చోరీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

బంగారుగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రక్షణ కోసం ఏర్పాటు చేసుకున్న పైపులను సమావారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని ప్రాధానోపాధ్యాయుడు ఎం.అశోక్ తెలిపారు. తరచూ పాఠశాల ఆస్తిని ధ్వంసం చేస్తూ, విలువైన సామాగ్రిని ఎత్తుకెళ్తున్నారని పేర్కొన్నారు. తాజాగా గత రాత్రి పాఠశాల ఆవరణలోని ఇనుప పైపులతో పాటు కూర్చొనే గద్దెను ధ్వంసం చేశారన్నారు. సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు సైతం పాల్పడ్డారని ఈ విషయమై పోలీసులకు సైతం ఫిర్యాదు చేసినట్టు పేర్కొన్నారు. అయినప్పటికీ ఏదోవిధంగా పాఠశాల ఆస్తిని ధ్వంసం చేస్తున్నారని వాపోయారు. సంబంధిత అధికారులు స్పందించి రాత్రి వేళల్లో పాఠశాలకు వాచ్‌మెన్‌ను నియమించాలని కోరారు. పాఠశాల సామాజిక ఆస్తి అందరిదని దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు తల ఇంత డబ్బులు వేసుకొని పాఠశాల కోసం చదువుతున్న విద్యార్థుల కోసం వెచ్చించి ప్రయివేటు కంటే ప్రభుత్వ పాఠశాల దీటుగా అభివృద్ధికి కృషి చేస్తున్నామని అన్నారు.

పాము కాటుకు రైతు మృతి

నవతెలంగాణ-దస్తురాబాద్

మండలంలోని గోడిసెరాల గోండుగూడ గ్రామానికి చెందిన మెస్రం భుజంగరావు(26) రైతు పాముకాటుకు మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 18న పాముకాటుకు గురైన భుజంగరావును మండలంలోని ఆకొండపేట గ్రామంలో ఓ నాటు వైద్యుని వద్ద వారం రోజుల పాటు వైద్యం అందించారు. పరిస్థితి విషమించడంతో ఈనెల 25న నిర్మల్‌లోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు నాటు వైద్యుని పై కేసు నమోదు చేశారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో పట్టణంలోని రిమ్స్ డైస్ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన వక్రపాదం ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఉమ్మడి జిల్లా నుంచి 0-18 సంవత్సరాల వయసు పిల్లలు పలువురు ఈ శిబిరానికి హాజరయ్యారు. ఆర్థోపెడిక్ అసిస్టెంట్ సర్జన్ నాగరాజ్ వక్రపాదం పిల్లలకు పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచిత శస్త్ర చికిత్సలు చేసి, వక్ర పాదాన్ని సరిచేస్తామని ఆయన పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా నుంచి అప్పుడే పుట్టిన పిల్లలు మొదలుకొని 18సంవత్సరాల పిల్లల వరకు వరకు 49మంది పేషేంట్స్ రావడం జరిగిందని తెలిపారు. ఇందులో 46 క్లబ్ ఫుట్, 6 ఫ్లాట్ ఫుట్ వరకు గుర్తించి, వీరికి సర్జరీ అవసరమని రిమ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆర్థోపెడిక్ డా.నాగరాజు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే సమన్వయ కర్త డా.వైసీ శ్రీనివాస్, పీజీ రాజు యాదవ్, క్యూర్ ఎన్జీఓ విజయ, డా.రాధికా, నాగార్జున్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, దొంతుల ప్రవీణ్ సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల ఉద్యోగాలు భర్తీ చేయాలని రాష్ట్రప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు



నవతెలంగాణ-తలమడుగు

గురుకుల ఉద్యోగాల భర్తీలో మిగిలిపోయిన నాన్ జాయినింగ్ ఉద్యోగాలను భర్తీ చేయాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి, గురుకుల బోర్డుకు మంగళవారం ఆదేశాలు జారీ చేసిందని ఓయూ జేఏసీ అధ్యక్షుడు ఎల్బల దత్తాత్రేయ తెలిపారు. గతంలో ఓయూ జేఏసీ తోపాటు తూము విజయ్, మనోహర్ మరో 20మంది సభ్యులు కలిసి కోర్టులో కేసు వేయగా, కేసుపై ఇన్టీమ్ ఆర్డర్‌తో కూడిన హైకోర్టు ఆదేశాలిస్తూ, బ్యాక్‌లాగ్ ఉద్యోగాలు మిగలకుండా చివరి ఉద్యోగం వరకు భర్తీ చేయాలని, గురుకుల బోర్డుకు, రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసినట్లు ఓయూ జేఏసీ అధ్యక్షులు తెలిపారు. నిరుద్యోగుల తరుపున గురుకుల ఉద్యోగాలలో డిసెండింగ్ ఆర్డర్ పాటిస్తూ, పోరాడుతున్న ఓయూ జేఏసీ అధ్యక్షులు ఎల్బల దత్తాత్రేయతో పాటు వారి మిత్ర బృందాన్ని అభినందించారు. గురుకుల 1:2 మెరిట్ అభ్యర్థులు ఈ న్యాయ పోరాటానికి పూర్తి మద్దతునిచ్చినందుకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

డిగ్రీ పరీక్ష ఫీజు 30లోగా చెల్లించాలి

నవతెలంగాణ-బేల

కాకతీయ విశ్వవిద్యాలయ పరిధిలో డిగ్రీ రెండు, నాలుగు, ఆరు సెమిస్టర్‌లు చదువుతున్న విద్యార్థులు ఈనెల 30లోగా ఎలాంటి అపరాధ రుసుము లేకుండా పరీక్ష ఫీజు చెల్లించాలని కళాశాల ప్రిన్సిపాల్ డా.వరప్రసాద్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. 29న గుడ్ ఫ్రైడే సెలవు దినం ఉన్నందున ఇంకా 3 రోజులు గడువు మిగిలి ఉందని తెలిపారు. చివరి నిమిషంలో ఒత్తిడి లేకుండా ఫీజుల చెల్లింపు చేసుకొని విద్యార్థులు పరీక్షలకు సిద్ధం కావాలని పేర్కొన్నారు.

ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి

నేటి నుంచి శిక్షణ తరగతులు



నవతెలంగాణ-నిర్మల్

ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి నేటి నుంచి శిక్షణ తరగతులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్నికల సిబ్బందికి విధులు, శిక్షణలపై నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాండమైజేషన్ పద్ధతి ద్వారా ఎంపిక చేసిన సిబ్బందికి ఎన్నికల విధులపై శిక్షణలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా ఏఎల్‌ఎంటీ (అసెంబ్లీ లెవెల్ మాస్టర్ ట్రైనర్లకు) 27న బుధవారం ఉదయం 10 గంటల నుంచి కలెక్టరేట్ సమావేశ మందిరంలో శిక్షణను ఇవ్వనున్నట్లు తెలిపారు. పీఓలు, ఏపీఓలకు ఏప్రిల్ 1, 2వ తేదీల్లో ఖానాపూర్ అసెంబ్లీ సెగ్మెంట్ అధికారులకు ఖానాపూర్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో, నిర్మల్ అసెంబ్లీ సెగ్మెంట్ వారికి సెయింట్ థామస్ పాఠశాలలో, ముధోల్ అసెంబ్లీ సెగ్మెంట్ వారికి ట్రిపుల్ ఐటీ బాసరలో శిక్షణను ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎన్నికల విధులలో పాల్గొనే అధికారులు శిక్షణా సమావేశాలకు విధిగా హాజరుకావాలని సూచించారు. హాజరుకాని అధికారులపై ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ హెచ్చరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, శిక్షణల నోడల్ అధికారి, డీఈఓ రవీందర్‌రెడ్డి, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాస్, ఈడీఎం నదీమ్ అధికారులు పాల్గొన్నారు.

మొదటి విడత ర్యాండమైజేషన్ పూర్తి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

లోక్‌సభ ఎన్నికలు 2024 పోలింగ్ సిబ్బంది మొదటి విడత ర్యాండమైజేషన్ పూర్తి చేసినట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. మంగళవారం జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో కలెక్టర్ ఛాంబర్‌లో ఎన్నికల సంఘం నిబంధనలననుసరిస్తూ లోక్‌సభ ఎన్నికలు 2024 పోలింగ్ సిబ్బంది. మొదటి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని పోలింగ్ కేంద్రాలలో ఎన్నికల విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులను, ఇతర పోలింగ్ అధికారులు, 768 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి మొత్తం 4,385 మందిని మొదటి విడత ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించడం జరిగిందని తెలిపారు. అందులో 2,240మంది ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఇతర అధికారులు 2,145, ప్రతి టీమ్‌లో ఒక ప్రిసైడింగ్ ఆఫీసర్, ఒక అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్, ఇద్దరు ఇతర పోలింగ్ ఆఫీసర్లు ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, డీపీఆర్వో తిరుమల, ఏఓ అరవింద్, ఈడీఎం రవీందర్, ఎన్ఐసీ సిబ్బంది పాల్గొన్నారు.

పెరిగిన కరువు భత్యం అమలు చేయాలి



నవతెలంగాణ-లక్ష్మణచాంద

బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న అన్ని రకాల కేటగిరీల కార్మికులు, బీడీ ప్యాకర్స్, బీడీ చాటర్స్, బట్టి కార్మికులందరికీ ఏప్రిల్ 1వ తేదీ నుంచి పెరిగిన కరువు భత్యం అమలు చేయాలని మండలంలోని చింతల్ చాంద గ్రామంలో మంగళవారం తెలంగాణ రాష్ట్ర ప్రగతి శీల బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.రాజన్న మాట్లాడుతూ పెరిగిన కరువు భత్యం తెలంగాణ రాష్ట్రంలో ఏడు లక్షల మంది బీడీ కార్మికులకు వర్తిస్తుందని, దీనిని వెంటనే అమలు చేయాలని బీడీ యాజమాన్యాలను డిమాండ్ చేశారు. కొన్ని బీడీ యాజమాన్యాలు పెరిగిన కరువు భత్యాన్ని కార్మికులకు అమలు చేయకుండా కుట్రలు చేసేటటువంటి విధానాన్ని మార్చుకోవాలని హెచ్చరించారు. కార్మికుల పొట్టకొడితే యాజమాన్యాలు తీవ్ర పరిణామాలు చెల్లించుకోవాల్సి వస్తుందని అన్నారు. ఇప్పటికే కొన్ని బీడీ యాజమాన్యాలు కార్మికుల నిజ వేతనాల నుంచి దోచుకుంటున్నారని ఆ పద్ధతి మానుకోవాలని తెలిపారు. వేతనం తక్కువ చెల్లిస్తున్నారని ఆ పద్ధతి మానుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రజిత, స్వప్న, శారద, నర్స, రాజలక్ష్మి పాల్గొన్నారు.

ఐదు రూపాయలకే భోజనం ప్రారంభం



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

ఇస్కాన్, పాయల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.ఐదుకే భోజనం పథకాన్ని స్థానిక వినాయక చౌక్ లోని గోపాలకృష్ణ మఠం వద్ద ఏర్పాటు చేశారు. మంగళవారం మఠం పీఠాధిపతి యోగానంద సరస్వతి ఇస్కాన్ నిర్వాహకులతో కలిసి ఎమ్మెల్యే పాయల శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దానాలలో గొప్పది అన్నదానం అని అటువంటి మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ తమకు వీలైనంతలో చేయాలని అన్నారు. పట్టణంలో రైతుబజార్, వినాయక చౌక్ ప్రాంతాలకు చుట్టుపక్కల గ్రామాల నుంచి రైతులు వివిధ పనుల కోసం వచ్చేవారు అధిక సంఖ్యలో ఉంటారన్నారు. ఇటు రైతు బజార్‌లో కూడా రైతులు ఉంటారని వీరందరికీ అతి తక్కువ ధరతో అంటే చాయ్ కన్నా కూడా తక్కువ ధరతో వారికి భోజనం ఏర్పాటు చేయాలన్న ఉద్దేశంతో ఇస్కాన్ సంస్థ వారితో కలిసి పాయల్ ఫౌండేషన్ ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. ఇంకా ఎవరైనా ముందుకు వస్తే వారితో కలిసి రైతుల కోసం వివిధ మార్కెట్ యార్డులలో భోజనాలను ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో ఇస్కాన్ సంస్థ నిర్వాహకులు, బీజేపీ నాయకులు పాయల్ శరత్, రాజేష్, విజయ్, రాజశేఖర్, సాయి, అర్జున్ పాల్గొన్నారు.

బొడ్డోని కుంటను పరిశీలించిన అధికారులు

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

పట్టణంలోని శాంతినగర్ ప్రాంతంలో ఉన్న బొడ్డోని కుంటను పలు శాఖల అధికారులు మంగళవారం పరిశీలించారు. కుంటలో నీరు దుర్గంద భరితంగా మారిన విషయాన్ని తెలుసుకున్న మున్సిపల్, రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు కలిసి కుంటను సందర్శించారు. గతంలో పశువులకు తాగునీటి కోసం ఉపయోగకరంగా ఉండే కుంట మురుగు మయమై నిరుపయోగంగా మారిందని అన్నారు. కుంటలోకి మురుగు నీరు రాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ చిన్నం సత్యం, తహసీల్దార్ శివరాజ్, మున్సిపల్ కమీషనర్ మనోహర్, ఇరిగేషన్ ఏఈ నవీన్, నాయకులు కుర్మ శ్రీనివాస్, నాయిని సంతోష్, పరిమి సురేష్, గంగపుత్ర సంఘం సభ్యులు పాల్గొన్నారు.



లక్ష్మీపూర్ చెక్‌పోస్ట్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన ఎస్పీ



నవతెలంగాణ-తలమడుగు

పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఎన్నికల కమిషన్ సూచనల మేరకు జిల్లా పోలీస్ గౌస్ ఆలం మంగళవారం మహారాష్ట్ర సరిహద్దులోని లక్ష్మీపూర్ చెక్ పోస్ట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మహారాష్ట్ర వైపు నుంచి వచ్చే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించి, ప్రయాణికులకు ఎలాంటి ఆటంకం కలిగించకుండా తనిఖీలు నిర్వహించాలన్నారు. జిల్లా ఎస్పీ స్వయంగా లారీ బస్సు ఇతర వాహనాలను తనిఖీ నిర్వహించారు. రూ.50వేల పైన ఎక్కువగా ఉన్నట్లయితే స్వాధీనపరుచుకోవాలన్నారు. రైతులు ఇతర వ్యాపారులు నగదు ఎక్కువ ఉన్నట్లయితే వాటికి సంబంధించిన ఒరిజినల్ రసీదులను పరిశీలించిన తర్వాత న్యాయబద్ధంగా ఉన్నట్లయితే విడుదల చేయాలని అన్నారు. లేని పక్షంలో అనుమానాలు వ్యక్తమైతే జిల్లాస్థాయి అధికారులు దృష్టికి తీసుకురావాలని అన్నారు. అనంతరం మహారాష్ట్ర చెక్‌పోస్ట్ పిప్పల్‌గావ్ పాట వద్దకు వెళ్లి రికార్డులను పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌ను, రైల్వే స్టేషన్‌ను సందర్శించి, రైళ్ల రాకపోకలపై ఆరా తీశారు. ఎస్పీ వెంట రూరల్ సీఐ ఫణిధర్, స్థానిక ఎస్సై ధనశ్రీ, ఏఎస్సై సురేందర్, కానిస్టేబుళ్లు దత్తు, శేషరావు, పోచ్చన్న ఎస్ఎస్‌టీం రవీందర్ ఉన్నారు.

ఉద్యమకారుల నూతన కార్యవర్గం ఎన్నిక

- అధ్యక్ష, కార్యదర్శులుగా దిగంబర్, సంధురి యాదవ్



నవతెలంగాణ-ముధోల్

తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ టీజేఏసీ మండల నూతన కార్యవర్గాన్ని టీజేఏసీ ఉద్యమకారుల ఫోరమ్ నాయకులు రోళ్ల రమేష్ అధ్యక్షతన మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా సోన్‌కామ్లె దిగంబర్, ఉపాధ్యక్షులుగా బండారి సాయినాథ్, కార్యదర్శిగా సంధురి యాదవ్, సహా కార్యదర్శిగా తాటోల్లా దశరథ్, కోశాధికారిగా తోడ్కర్ గోవింద్ పటేల్, సలహాదారులుగా వరగంటి ప్రకాష్, గుంజల నారాయణ, సభ్యులుగా ఉమాకాంత్, శంకర్, ప్రవీణ్ యాదవ్, పండరి, వీరాచారి, భోజన్న, గంగాధర్, సాయినాథ్, గంగాధర్, హన్మాండ్లు, నారాయణ, గంగాధర్, లింగన్న, గంగాధర్, సాయినాథ్, దినేష్, మణికంఠ, లక్ష్మణ్, సాయన్న ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ముధోల్ తెలంగాణ ఉద్యమ రచనా కమిటీ సభ్యులు ముధోల్ మండల కేంద్రంలో ఉద్యమకారుల వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గం ఉద్యమకారుల ఫోరమ్ అధ్యక్షులు పండిత్‌రావు పటేల్, ఉద్యమ చరిత్ర రచయితలు సామ జనార్ధన్‌రెడ్డి, పుండలిక్‌రావు, పీసర శ్రీనివాస్‌గౌడ్, బస్వరాజ్, ఆసంవార్ సాయినాథ్, ఉద్యమకారుడు రాములు పాల్గొన్నారు.

సమస్యను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తా

- సామ రూపేష్‌రెడ్డి



నవతెలంగాణ-బేల

మండలంలోని మశాలా(బి) గ్రామపంచాయతీలోని తలాయిగూడ గ్రామానికి రోడ్డు సౌకర్యం లేక ఇక్కడి ఆదివాసీ ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రుపేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం తలాయిగూడ గ్రామాన్ని సందర్శించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించారు. ముఖ్యంగా ఏండ్లు గడుస్తున్నా రోడ్డు సౌకర్యం లేక నానా అవస్థలు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం, అధికారులకు ఎన్నిసార్లు రోడ్డు సౌకర్యం కల్పించాలని విన్నవించినా పట్టించుకోలేదని తెలిపారు. ఈ సందర్భంగా సామ రూపేష్‌రెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి ద్వారా రాష్ట్ర, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క దృష్టికి సమస్యను తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని అన్నారు. ఆయన వెంట రమేష్ పటేల్, దోటే ఈశ్వర్, కన్య రాజు, గ్రామస్తులు రామ్, శ్యామ్, నాగరావు ఉన్నారు.

ఏకగ్రీవంగా బార్ అసోసియేషన్ ఎన్నిక

నవతెలంగాణ - సిర్పూర్(టీ)





సిర్పూర్ జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఏకగ్రీవంగా ఎన్నికైంది. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వి కిశోర్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా గణపతి, ఉపాధ్యక్షుడిగా బి శ్రీనివాస్, సీహెచ్ శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీగా సతీష్, కోశాదికారిగా కళ్యాణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు

నవతెలంగాణ-తలమడుగు



పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో భాగంగా తాంసి, తలమడుగు, భీంపూర్ మండలాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ మంగళవారం తనిఖీలు నిర్వహించారు. వచ్చిపోయే వాహనాలను తనిఖీ నిర్వహిస్తూ, సీసీ కెమెరాలతో పాటు వీడియో తీశారు. మూడు మండలాల్లో ఫ్లయింగ్స్ స్క్వాడ్స్ పర్యటిస్తూ ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే ఎంతటి వారినైనా ఎన్నికల కమిషన్ సూచనల మేరకు చర్యలు తీసుకుంటామని ఫ్లయింగ్ స్క్వాడ్ టీం హెచ్‌డీ మహేందర్ తెలిపారు. తనిఖీలు నిర్వహించిన వారిలో కానిస్టేబుల్ విఠల్, వసంత్ వీడియో కెమెరమెన్ మాధవ్ ఉన్నారు.

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

నవతెలంగాణ-నిర్మల్

యాసంగి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లను త్వరితగతిన పూర్తిచేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లు, ఎండాకాలం నేపథ్యంలో తాగునీటి సౌకర్యాలపై జిల్లా కలెక్టర్లతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ యాసంగి సీజన్‌కు సంబంధించిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లను పూర్తిచేయాలని సూచించారు. కేంద్రాలలో ప్యాడి క్లీనర్, టార్పలిన్స్, గన్నీలు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, కస్టం మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) లక్ష్యాలను వెంటనే పూర్తి చేయాలన్నారు. రైతులు ఎవరు ధాన్యం అమ్మకానికి దళారులను ఆశ్రయించకుండా చూడాలన్నారు. ఎండాకాలం నేపథ్యంలో తాగునీటి సౌకర్యాన్ని కల్పించాలని, తేమ శాతానికి సంబంధించిన వివరాలపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ జిల్లాలో 203 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ తొలి వారంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్టు తెలిపారు. కొనుగోలుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, వరి ధాన్యం అక్రమ రవాణా జరగకుండా స్వర్ణ, బెల్ తరోడ, బిద్రెల్లిలలో అంతర్‌రాష్ట్ర చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని కలెక్టర్ వివరించారు. అనంతరం ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని సీఎస్ అధికారులను ఆదేశించారు. పనిచేయని చేతి పంపులు, బోర్వెల్స్‌లను వెంటనే మరమ్మత్తులు చేయించాలని అధికారులను ఆదేశించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో అవసరమైన ప్రదేశాలలో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని సూచించారు. ప్రజలకు నీటి సమస్యలు ఏర్పడకుండా తక్షణ చర్యలకు భగీరథ, గ్రామపంచాయతీ అధికారులతో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించాలని పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, డీపీఓ శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సందీప్, జిల్లా పౌరసరాలశాఖ అధికారి నందిత, డీఎం శ్రీకళ ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.





పశువుల తరలింపు గొడవలో ఇరుగ్రూపులపై కేసు



నవతెలంగాణ - సిర్పూర్(టీ)

మహారాష్ట్ర నుండి హైదరాబాద్‌కు లారీలో 19పశువులను తరలిస్తుండగా ఆదివారం రాత్రి మండల కేంద్రంలోని డౌనల్ కాలనీలో ఒక గ్రూపుకు చెందిన వారు అడ్డుకున్నారు. వాహన తలుపులు తెరిచి చూపించాలని కోరగా మరో గ్రూపునకు చెందిన వారు అభ్యంతరం చెప్పారు. దీంతో ఇరు గ్రూపుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. సీఐ సాదిక్‌పాషా, ఎస్ఐ దీకొండ రమేష్ ఘటన స్థలానికి చేరుకొని వారిని సముదాయించి లారీలో ఉన్న పశువులను కాగజ్‌నగర్ గోశాలకు తరలించారు. ఇరు గ్రూపులకు చెందిన 22 మందిపై కేసు నమోదు చేశారు.

ఎంపీగా ఆశీర్వదించాలి

- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు



నవతెలంగాణ-నార్నూర్

ఎంపీగా ఆశీర్వాదించాలని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు కోరారు. మంగళవారం పలు గ్రామాల్లో పర్యటించారు. కొత్తపెల్లి(హెచ్) దీక్షా భూమిలో దీక్షాగురు ప్రేమ్‌సింగ్ మహారాజ్ ఆశీస్సులు తీసుకున్నారు. ఎంపీ అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత ఆయన మండలానికి మొదటి సారి రావడంతో మాన్కాపూర్ గ్రామంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ తొడసం నాగోరావ్ ఇంటి అవరణలో నాయకులు శాలువా కప్పి సన్మానించారు. బీఆర్ఎస్ నాయకులతో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను అభివృద్ధి పనులను కార్యకర్తలు ప్రజలకు వివరించాలని అన్నారు. జామడ గ్రామపంచాయతీలో సార్మెడి దుర్గు పటేల్, జైవంత్ మహారాజ్‌ను ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మాన్కాపూర్ గ్రామపటేల్ మెస్రం రూపదేవ్, ఐటీడీఏ డైరెక్టర్ మడావి మాన్కు, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మెస్రం హన్మంతరావ్, మండల మాజీ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఉర్వేత రూపదేవ్, నాయకులు సయ్యద్ కాశీం, ఫెరోజ్, శివాజీ, వివిధ గ్రామాల మాజీ సర్పంచులు ఆడ శ్రీరాం, మడావి కైలేశ్వరి సాగర్, జాదవ్ ఝిజాబాయి ప్రేమ్, కనక సేవంత ప్రభాకర్, ముక్తా రూపదేవ్, మాజీ ఉప సర్పంచులు విష్ణు ఫడ్, అజ్జు, నాయకులు మెస్రం మానిక్‌రావ్, శశాంక్, మసూద్, గోపాల్, దయానంద్, హనుమంత్‌రావ్, సలీం ఉన్నారు.

సమిష్టి కృషితో పార్టీని గెలిపించాలి



నవతెలంగాణ-ఉట్నూర్

బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల సమిష్టి కృషితో పార్లమెంటు ఎన్నికల్లో తనను గెలిపించాలని ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు అన్నారు. మంగళవారం మండలంలోని ఘనపూర్, ఉట్నూర్ గ్రామంలో మండల స్థాయి ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. ఎన్ని పార్టీలు కలిసి వచ్చినా ఆదిలాబాద్ పార్లమెంట్‌లో గెలిచేది బీఆర్ఎస్ మాత్రమే అని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాలని కోరారు. ఆదిలాబాద్ పార్లమెంట్ నుంచి గులాబీ జెండాను ఎగరవేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పంద్ర జైవంత్ రావు, నర్సాపూర్ మాజీ సర్పంచ్ కళావతి, బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేష్, సీతారాం పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలి

నవతెలంగాణ-లక్షెట్టిపేట

లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో బీజేపీని గెలిపించాలని పెద్దపెల్లి బీజేపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పట్టణంలోని బస్ స్టాండ్ నుంచి ఉత్కూర్ చౌరస్తా వరకు బీజేపీ జిల్లా అధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని ప్రతి షాప్‌కు వెళ్లి వ్యాపారుస్తులను ప్రజలను కలిసి వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ పార్టీకి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రంలో మూడోసారి వచ్చేది నరేంద్ర మోదీ ప్రభుత్వమే అని దేశ ప్రజలు మోదీని మరొకసారి ప్రధాన మంత్రిని చేయడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు తమ్మినేని శ్రీనివాస్, మండల అధ్యక్షుడు గొప్ప కిషన్, పట్టణ అధ్యక్షుడు హరి గోపాల్ పాల్గొన్నారు.

కులమతాలకతీతంగా పండుగలు జరుపుకోవాలని

నవతెలంగాణ-ఉట్నూర్

కుల మతాలకతీతంగా పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని యువ నాయకులు అజ్మీర జయచంద్ర అన్నారు. మంగళవారం మండలంలోని లక్కారం గ్రామంలో మజ్జిదే అక్సలో రంజాన్ మాసం పురస్కరించుకొని ముస్లీంలకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ప్రతి ఒక్కరు సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఖయ్యుం, కాంగ్రెస్ నాయకులు నిసార్, ఆయా ప్రజాసంఘాల నాయకులు భుజంగరావు, అజ్మీర్ నరేష్, సలీం, కలీం మౌలానా, ఉసుమాన్, సాజిద్ ఖాన్, సలీం పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో నార్మల్ డెలీవరీలు జరిగేలా చూడాలి

నవతెలంగాణ-ఉట్నూర్

ఉమ్మడి జిల్లాలోని పీహెచ్‌సీల్లో నార్మల్ డెలీవరీలు జరిగేలా డాక్టర్లు చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ పీఓ కుష్బు గుప్తా అన్నారు. మంగళవారం ఐటీడీఏ కార్యాలయంలో 32 పీహెచ్‌సీల్లోని వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రతి పీహెచ్‌సీలో ఎంసీహెచ్ యాక్టివిటీస్, వ్యాధి నిరోధక టీకాలు, ఏఎన్‌సీ చెకప్, ఇమ్యూనైజేషన్‌లు 100 శాతం జరిగేలా చూడాలని ఆదేశించారు. ప్రతి పీహెచ్‌సీలలో నార్మల్ డెలివరీ జరిగేలా చూడాలని, వైద్యాధికారులు సమయపాలన పాటించాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మందుల కొరత లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. ఆస్పత్రికి వచ్చే రోగులను ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపుజిల్లా వైద్యాధికారులు డాక్టర్ బాలు, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల్ జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు, డాక్టర్లు పాల్గొన్నారు.





ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించాలి



నవతెలంగాణ - సిర్పూర్(టీ)

రానున్న పార్లమెంటు ఎన్నికల దృష్ట్యా ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కౌటాల సీఐ సాదిక్‌పాషా అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని కమిషన్ ఆదేశాలను తూచా తప్పకుండా పాటించాలని తెలిపారు. వాహనాలకు సంబంధించిన సరైన ధృవీకరణ పత్రాలు కలిగి ఉండాలని, మద్యం తాగి వేగంగా వాహనాలు నడపరాదని పేర్కొన్నారు. చట్టానికి విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మొదటి దశ ర్యాండమైజేషన్‌కు ఏర్పాట్లు

నవతెలంగాణ ఆసిఫాబాద్

లోక్‌సభ ఎన్నికలు-2024లో భాగంగా జిల్లాలో పోలింగ్ సిబ్బంది మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియకు ఏర్పాటు చేస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మంగళవారం సిర్పూర్, ఆసిఫాబాద్ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు దీపక్ తివారి, దాసరి వేణుతో కలిసి జిల్లా రెవెన్యూ అధికారి లోకేశ్వర్, నోడల్ అధికారి(మ్యాన్ పవర్) అశోక్, తహసీల్దార్ శ్రీనివాస్‌రావుతో కలిసి ర్యాండమైసేషన్ ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్‌లో సిబ్బందికి కేటాయించిన మొదటి దశలో 3వేల973 మందిని ర్యాండమైజేషన్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఉద్యోగులకు ఎస్ఎంఎస్‌తో పాటు సంబంధిత ప్రతిని అందించడం జరుగుతుందని, ఉద్యోగులు తమకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు.



ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు శిక్షణ అందించడం జరుగుతుందని, పోస్టల్ బ్యాలెట్ ఫారాలను పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఉద్యోగులకు కేటాయించిన విధులలో సవరణల కొరకు జిల్లా ఎన్నికల అధికారికి దరఖాస్తు రూపంలో అందజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ గౌతమ్ రాజు, నేషనల్ ఇన్ఫర్మేషన్ సిబ్బంది డి.శ్రీకాంత్, రాజ్‌కుమార్, లక్ష్మణ్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆదిలాబాద్ యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. పట్టణంలోని అర్పా గార్డెన్‌లో జర్నలిస్ట్‌లు, పుర ప్రముఖులు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు. ముందుగా ప్రత్యేక ప్రార్థనలు చేసి ఖర్జూరాలు తిని, ఉపవాస దీక్షలను విరమించారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజెఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షాహిద్ అహ్మద్, ఖాజీర్ అహ్మద్, మహబూబ్, అన్వర్, షేక్ మోయిజ్, అస్మత్ అలీ, అమీమ్, మున్సిపల్ కమిషనర్ ఖమర్ హైమద్, మున్సిపల్ వైస్ చైర్మెన్ జహీర్ రంజానీ, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి, ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు నజీర్ అహ్మద్, మాజీ డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

- రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షులు సంగెపు బొర్రన్న



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని బరంపూర్ గ్రామానికి చెందిన కాకర్ల ఆశన్న రైతు కుటుంబాన్ని మంగళవారం రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షులు సంగెపు బొర్రన్న పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వారం రోజుల కింద పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఆశన్న కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతు ఆశన్న తనకున్న మూడు ఎకరాలతో పాటు మరో ఐదు ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి పంట సాగు చేస్తుండగా గత సంవత్సరం ఈ సంవత్సరం ఖరీఫ్ పంటలో దిగుబడి రాకపోవడంతో రైతు ఆత్మహత్య చేసుకున్నట్టు తెలిపారు. గత సంవత్సరం నుంచి పంటలు దిగుబడి రాకపోగా తెచ్చిన అప్పులు పేరుకుపోవడంతో రైతు ఆత్మహత్యకు పాల్పడ్డట్టు తెలిపారు. ప్రతి సంవత్సరం అతివృష్టి అనావృష్టితో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. మానసికంగా కుంగిపోయి పంటకు పెట్టిన పెట్టుబడులు రాలేవని, తీసుకొచ్చిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనోవేదనకు గురై తాను పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్టు తెలిపారు. ఆత్మహత్య చేసుకున్న రైతు ఆశన్న కుటుంబానికి రైతుభీమాతో పాటు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 194 జీఓ ప్రకారంగా రూ.6లక్షలు నష్ట పరిహారం అందించి, ఆదుకోవాలని అన్నారు. ఆత్మహత్య చేసుకున్న రైతు భార్యకు ప్రతినెల రూ.5వేల పెన్షన్ ఇచ్చి ఆదుకోవాలని అన్నారు. పిల్లలకు ఉన్నతమైన విద్య, వైద్య ఉపాధి అవకాశాలు, ఇతర సదుపాయాలు అందించాలని అన్నారు. ఆయన వెంట రైతులు నారాయణరెడ్డి, అభిలాష్‌రెడ్డి, ప్రతాప్, అశోక్, అఖిల్ గ్రామస్తులు ఉన్నారు.

ఎల్లమ్మ ఉత్సవాలు ప్రారంభం

నవతెలంగాణ-ఖానాపూర్ టౌన్

ఖానాపూర్ పట్టణం గోదావరి నదీ తీరంలో ఉన్న రేణుక ఎల్లమ్మ అమ్మవారి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయాన్ని గౌడ సంఘం పెద్దలు రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించి, భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేశారు. మంగళవారం అమ్మవారి జోగెత్తు కార్యక్రమం నిర్వహించారు. ఐదు రోజులు ఇంటింటా తిరిగి జోగెత్తు కార్యక్రమంతో పాటు, రాత్రిపూట ఆలయ వద్ద ఒగ్గు కళాకారులచే ఎల్లమ్మ కథను చెబుతారు. ఈనెల 31 అమ్మవారి బోనాలు, మే 1న గంగస్నానం పుట్టధని, 2న జాతర మహోత్సవం నిర్వహిస్తారు. ఐదు రోజులు ఇంటింటా తిరిగే జోగెత్తు కార్యక్రమంతో పాటు రాత్రిపూట ఆలయం వద్ద ఒగ్గు కళాకారుల బృందం ఎల్లమ్మ కథను చెబుతారు. వారం రోజులు జరిగే ఎల్లమ్మ వార్షికోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో హజరుకాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు ఒల్లాల చిన్న నర్సయ్య, గుగ్గిళ్ల రాజేందర్, షిర జగన్, వెంకాగౌడ్, బుర్ర రాజారాం, కాసారపు మల్లేశ్, పరమేశ్వర్ గౌడ్ కోరారు.



నవతెలంగాణ
మంచిర్యాల
బుధవారం | మార్చి 27, 2024 | www.navatelangana.com

పోలింగ్ కేంద్రాల పరిశీలన

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని బొమ్మెన, మహమ్మదాబాద్ గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను మండల తహసీల్దార్ సి రాజ మనోహర్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే పార్లమెంటు ఎన్నికలకు పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేస్తున్నామన్నారు. మంచినీరు విద్యుత్తు, ఫర్నిచర్ ఏర్పాటు చేయాలని కార్యదర్శులకు సూచించారు, పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. తహసీల్దార్‌తో పాటు ఆర్ఐ భానుచందర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

నవతెలంగాణ-జన్నారం



వరల్డ్ టీబీ డే సందర్భంగా జన్నారంలోని బాయ్స్ హై స్కూల్లో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు డాక్టర్ ఉమాశ్రీ మంగళవారం బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉమాశ్రీ మాట్లాడుతూ, టీబీని నివారించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మూడు రోజులు కంటే ఎక్కువ రోజులు దగ్గు వస్తే వెంటనే ఆస్పత్రిలో పరీక్ష చేయించుకోవాలన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో, క్షయ వ్యాధికి ఉచిత వైద్య పరీక్షలు చేసి మందులు గోలీలను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాదాలకు అధికారులను బాధ్యులు చేయడం సరికాదు

నవతెలంగాణ-నస్పూర్

గనులలో పలు విభాగాలలో జరిగిన ప్రమాదాలలో కేవలం అధికారులనే బాధ్యులను చేస్తూ అధికారులపై చర్యలు తీసుకోవాలని కొందరు డిమాండ్ చేయడం సరికాదని దీనిని శ్రీరాంపూర్ ఏరియా అధికారుల సంఘం తీవ్రంగా ఖండిస్తునట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గనులలో ఇటువంటి ప్రమాదాలు జరగడం దురదృష్టకరమని, ఇటువంటి ప్రమాదాలు జరిగినప్పుడు డీఎంఎస్ అధికారులు తగిన విచారణ చేసి దానికి బాధ్యులైన వారిపై చట్టపరంగా తగిన క్రమశిక్షణ చర్యలను తీసుకోవడం జరుగుతుందని, దీనికి అధికారులను మాత్రమే బాధ్యులను చేయాలని డిమాండ్ చేయడం, వారి పైన చర్యలు తీసుకోవడం వారి మనోస్థైర్యాన్ని దెబ్బతీస్తుందన్నారు. శ్రీరాంపూర్ ఏరియాలో డిప్యూటేషన్, బదిలీలు ఎటువంటి ప్రలోభాలు లేకుండానే నిబంధనలకు అనుగుణంగా చేయడం జరుగుతుందని, ఎవరికైనా అనుమానం ఉన్నవారు పై అధికారుల దృష్టికి, విజిలెన్స్ విభాగ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లవచ్చని పేర్కొన్నారు. సింగరేణిలో మహిళా ఉద్యోగుల సంరక్షణకు ఇంటర్నల్ కంప్లైంట్ సెల్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని, ఏదైనా సమస్య ఉన్న ఎడల తగిన ఆధారాలతో ఇంటర్నల్ కంప్లైంట్ సెల్‌లో ఫిర్యాదు చేసిన ఎడల కమిటీ తగిన విచారణ జరిపి ఇచ్చిన రిపోర్టు ఆధారంగా బాధ్యులైన వారిపై చర్య తీసుకోవడం జరుగుతుందన్నారు. కేవలం అధికారులను ఇబ్బందులకు గురి చేయడానికి ఇటువంటి నిరాధార ఆరోపణలు చేయటం మూలంగా వారి యొక్క మనోభావాలను దెబ్బతీయడం జరుగుతుందని, కావున ఇటువంటి నిరాధార ఆరోపణ చేయవద్దని శ్రీరాంపూర్ ఏరియా అధికారుల సంఘం తరపున విజ్ఞప్తి చేశారు.

మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

• జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్

నవతెలంగాణ-నస్పూర్



లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా జిల్లాలో ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ మొదటి దశను పూర్తి చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల సందర్భంగా జరుగుతున్న పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సబావత్ మోతిలాల్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని ఎన్నికల కొరకు పోలింగ్ సిబ్బంది మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. ఇందులో 1,131 ప్రిసైడింగ్ అధికారులు, 1,111 సహాయ ప్రిసైడింగ్ అధికారులు, 2187 మంది ఇతర ప్రిసైడింగ్ అధికారులు మొత్తంగా 4429 మంది సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి చేయడం జరిగిందని, సిబ్బందికి ఎస్ఎంఎస్‌తో పాటు సంబంధిత ఉత్తర్వులను అందించడం జరుగుతుందని, ఉద్యోగులు తమకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్, ఇతర ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. ఉద్యోగులకు కేటాయించిన విధులలో సవరణలకు జిల్లా ఎన్నికల అధికారికి దరఖాస్తు రూపంలో అందజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల తహసీల్దార్ శ్రీనివాస్, ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ సునీల్ పాల్గొన్నారు.

క్వాలిఫైడ్ వైద్యులను, సిబ్బందిని వెంటనే నియమించాలి

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోనీ డిస్పెన్సరీలలో సింగరేణి యాజమాన్యం వైద్య సేవలు అందించాలని, సరియైన వైద్య సిబ్బంది లేక అనేక మంది కార్మికుల, కార్మిక కుటుంబాల విలువైన ప్రాణాల కోసం తగిన వైద్యం అందించడం లేదని తక్షణమే వైద్య సేవలు అందించుటకు క్వాలిఫైడ్ డాక్టర్లను, పారామెడికల్ సిబ్బందిని నియమించాలని సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్(బిఎంఎస్) ఏరియా కార్యదర్శి నాతాడి శ్రీధర్ రెడ్డి డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్ ఏరియా కార్మికుల సంఖ్యాపరంగా అతిపెద్ద డివిజన్ అయినప్పటికీ వైద్య సేవలలో కార్మికులకు అంతంత మాత్రమే ప్రయోజనం చేకూరుతుందని, ప్రస్తుతం సింగరేణిలో ఎక్కువ శాతం యువ కార్మికులు ఉన్నారని, వారికి కుటుంబ పరంగా పిల్లల డాక్టర్, గైనకాలజిస్ట్ సేవలు అందుబాటులో లేకపోవడం వల్ల ప్రయివేట్ ఆస్పత్రి సంప్రదించాల్సి వస్తుందని, దీంతో ఆర్థికంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. అలాగే రామకృష్ణాపూర్ ఏజ్ హాస్పిటల్‌లో సిటీ స్కాన్ నిపుణులతో, అన్ని రకాల వైద్య సేవలను అంబాటులోకిలోకి తీసుకువచ్చి కార్మికులకు తగిన సేవలు అందించాలని డిమాండ్ చేశారు.

కేంద్ర బలగాలతో పోలీసుల కవాతు



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

రాబోయే లోక్ సభ ఎన్నికలలో ప్రజలు ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా ప్రజలు సహకరించాలి మంగళవారం పోలీసులు కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. రామగుండం పోలీస్ కమిషనర్, ఎం శ్రీనివాసులు ఉత్తర్వుల మేరకు మంచిర్యాల డీసీపీ అశోక్ గారి ఆదేశాల మేరకు, బెల్లంపల్లి సబ్ డివిజన్ ఏసీపీ రవికుమార్ ఆధ్వర్యంలో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవరం కేంద్ర బలగాలతో కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి ఏసిపి మాట్లాడుతూ ప్రజలందరూ తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని కోరారు. ఎన్నికల ప్రక్రియ ముగిసేంతవరకు పోలీసు వారి నియమ నిబంధన సూచనలు పాటిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకుని, పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మందమర్రి సర్కిల్ ఇన్స్‌పెక్టర్ శశిధర్‌రెడ్డి, ఎస్ఐలు రాజశేఖర్, ఆంజనేయులు, ప్రవీణ్ కుమార్, 100 మంది కేంద్ర బలగాలు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఉపకార వేతనాలు, బోధన ఫీజులు వెంటనే విడుదల చేయాలి

• పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్



నవతెలంగాణ-నస్పూర్

ఉపకార వేతనాలు, బోధన ఫీజులు రాక విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదని వెంటనే వాటిని విడుదల చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ అన్నారు. మంగళవారం మంచిర్యాలలో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు రావలసిన బోధన ఫీజులు, ఉపకార వేతనాలు గత మూడు సంవత్సరాలు కాలంగా రూ. 5,600 కోట్లు పెండింగ్ ఉండడం వల్ల విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఫీజు బకాయిలు విడుదల చేస్తారని ఆశతో కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులు ఉపకార వేతనాలు రాక కళాశాలలో యాజమాన్యం సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, దీనివలన విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురై ఆత్మహత్య చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. అంతేకాకుండా ట్రెజరీలలో నిలిచిన రూ.1500 కోట్ల టోకెన్లు అలాగే పెండింగ్‌లో ఉన్నాయని, ఈ సంవత్సర బడ్జెట్ లెక్కల్లో మార్చి31లోగా విడుదల కాని ఎడల ప్రభుత్వం చేతులు ఎత్తేసే పరిస్థితి కనబడుతోందని, ఇప్పటికైనా దీనిపై ప్రభుత్వం స్పందించి తక్షణమే విద్యార్థులకు రావలసిన ఫీజు రియంబర్మెంట్, స్కాలర్షిప్ తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘం ఆధ్వర్యంలోని రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శ్రీను, అజయ్ సాయి, అభి పాల్గొన్నారు.

కాంగ్రెస్ జాతీయ అధ్యక్షున్ని కలిసిన పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి వంశీ



నవతెలంగాణ-జైపూర్

కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేను పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. తన తండ్రి చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి, పెద్ద తండ్రి బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌తో పాటు మంగళవారం ఢిల్లీలో కలిశారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థిగా అవకాశం కల్పించిన ఏఐసీసీ నాయకులకు ఈ సందర్భంగా వంశీకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

కాసిపేటలో అదనపు కలెక్టర్ పర్యటన



నవతెలంగాణ-కాసిపేట

మండలంలో మంగళవారం అదనపు కలెక్టర్ బి రాహుల్ పర్యటించి పోలింగ్ కేంద్రాలను, అంగన్‌వాడీ కేంద్రం, గ్రంథాలయాన్ని తనిఖీ చేశారు. దేవాపూర్ గ్రామ పంచాయతీలోని డీఏవీ స్కూల్లోని పోలింగ్ కేంద్రాన్ని, కాసిపేట గ్రామ పంచాయతీలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి పిల్లలకు అందిస్తున్న పోషక పదార్థాలు, పుస్తకాలు, విద్యాభ్యాసం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాసిపేట గ్రంథాలయాన్ని పరిశీలించి విద్యార్థులకు అన్ని రకాల పుస్తకాలు, స్టడీ మెటిరియల్ అందుబాటులో ఉన్నాయా లేవా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ భోజన్న, ఎంపీడీఓ సత్యనారాయణ సింగ్, ఎంపీఓ నాగరాజు, కార్యదర్శులు కవిత, సౌంధర్య పాల్గొన్నారు.

మద్యానికి బానిసై యువకుని ఆత్మహత్య

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని సోనాపూర్ గ్రామానికి చెందిన మడావి సురేష్(18) మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఎస్ఐ రాములు తెలిపిన వివరాల ప్రకారం.. మద్యానికి బానిసై ప్రతిరోజు తల్లి మడావి పార్వతితో గొడవ పడుతుండేవాడు. సోమవారం హోళి పండుగ సందర్భంగా మద్యం తాగి ఉదయం బయటకు వెళ్లాడు. మధ్యాహ్నం మూడు గంటలకు ఇంటికొచ్చి మద్యానికి డబ్బులు ఇవ్వాలని తల్లితో గొడవ పడ్డాడు. తల్లి పార్వతి సురేష్‌ను నీ తండ్రి చనిపోయి రెండు సంవత్సరాలు అవుతుంది నువ్వు నాకు ఆసరాగా ఉంటావని అనుకున్న. కానీ నువ్వు ఇలా మద్యం తాగి డబ్బులు వృథా చేస్తే ఎలా అని, మందలించడంతో సురేష్ కోపంతో ఇంటి నుండి బయటకు వెళ్లిపోయి ఏదో గుర్తు తెలియని పురుగుల మందు తాగి ఇంటికొచ్చి, పురుగుల మందు తాగానని వాంతులు చేసుకుంటూ తల్లితో చెప్పాడు. అప్పటికే స్పృహకోల్పోయి కిందపడిపోయాడు. సురేష్‌ను వెంటనే కుటుంబసభ్యులు ద్విచక్ర వాహనంపై మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు అక్కడి నుండి ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుండి మెరుగైన చికిత్స కోసం బెల్లంపల్లి ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. మృతుడి తల్లి మడావి పార్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్టు ఎస్ఐ తెలిపారు.

పోలింగ్ కేంద్రాల్లో అన్ని సదుపాయాలు కల్పించాలి

• తహసీల్దార్ రాఘవేంద్ర రావు

నవతెలంగాణ-లక్షెట్టిపేట



రాబోడు లోక్‌సభ ఎన్నికలకు పోలింగ్ కేంద్రాల్లో అన్ని సదుపాయాలు కల్పించేందుకు అధికారులు విధిగా బాధ్యతలు నిర్వర్తించాలని తహసీల్దార్ రాఘవేంద్ర రావు అధికారులను ఆదేశించారు. మంగళవారం మండల పరిషత్ మీటింగ్ హాల్‌లో మండల స్థాయి ఎన్నికల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే ప్రచురించిన వోటర్ లిస్టులను క్షుణ్ణంగా పరిశీలించి ఎవరివైనా పేర్లు నమోదు కాకుండా ఉంటే వెంటనే నమోదు చేయాలన్నారు. ఎన్నికల రోజున ఓటర్లకు నీడ కొరకు టెంట్ వేయాలన్నారు. ఓటర్లకు మంచి నీటి సదుపాయం కల్పించాలని, ప్రతి పోలింగ్ బూతు వద్ద మెడికల్ టీమ్ ఉండాలన్నారు. బీఎల్‌ఓలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సహకరించలన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో మంచి నీటి వసతి, నీడ కొరకు టెంట్లను స్తానిక గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేయాలన్నారు. బీఎల్‌ఓలు పంచాయతీ కార్యదర్శులతో సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రతి బూత్ వద్ద కావలసిన సామానులు అన్ని అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సరోజ, హాజీపూర్ ఎంపీడీఓ మధుసూదన్, ఇరిగేషన్ డిప్యూటీ ఎక్షిక్యూటివ్ ఇంజనీర్ చైతన్య, శ్రీ మనిక్ రావు, ఏఈ గౌతం, మున్సిపల్ కమిషనర్ కల్లెడ రాజ శేఖర్, రామ్ మోహన్, అతీష్ కుమార్, సూపర్వైజర్లు సమ్మక్క, నవీత్, జీవన్‌రెడ్డి, బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

రేపు ఇసుక వేలం పాట

నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని ఇంద్రానగర్, గొల్లగూడెం గ్రామ పంచాయతీలో ఈ నెల 22న విజిలెన్స్, ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు సీజ్ చేసిన ఇసుకను 28న వేలం వేస్తున్నట్టు తహసీల్దార్ జోత్స్న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గంగాపూర్ పశు వుల సంత నిలువ చేచేసి ఉందని తెలిపారు. మండల వాసులు ఈ వేలం పాటలో పాల్గొనాలని కోరారు. వేలం పాటలో ఇసుకను సొంతం చేసుకున్న వారు ఒకేసారి నగదు మొత్తం డీడీ రూపంలో చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. దాదాపు ఈ ఇసుక 190 ట్రాక్టర్లలో 570 క్యూబిక్ మీటర్ వరక ఉంటుందని తెలిపారు.

చెక్‌పోస్ట్ వద్ద నగదు సీజ్



నవతెలంగాణ-కాసిపేట

కాసిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని చొప్పరిపల్లి సమీపంలో ఎన్నికల కోడ్ నేపథ్యంల్లో భాగంగా ఏర్పాటు చేసిన పోలీస్ చెక్ పోస్ట్ వద్ద కాసిపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ఎటువంటి ఆధారాలు లేకుండా గోలేటికి చెందిన అప్పం మల్లేశ్ వద్ద రూ.54700, రవీంద్రనగర్‌కు చెందిన మాచర్ల రాకేశ్ వద్ద రూ.51000 నగదు తరలిస్తుండగా స్వాధీనం చేసుకొని మొత్తం రూ.1,05,700 లక్షలను పోలీసులు సీజ్ చేశారు. సీజ్ చేసిన నగుదును తదుపరి చర్యల నిమిత్తం ఎస్ఎస్టి టీంకు అప్పగించినట్లు ఎస్ఐ ప్రవీణ్ కుమార్ వివరించారు.

వ్యక్తిగత బీమా కుటుంబానికి ధీమా



నవతెలంగాణ-జైపూర్

కుటుంబ వ్యక్తులు వ్యక్తిగత బీమా చేసుకోవడం ద్వారా కష్టకాలంలో కుటుంబానికి ధీమా ఉంటుందని శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఏజీఎం అట్ల సురేష్ అన్నారు. శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ పొందిన టేకుమట్ల గ్రామానికి చెందిన కొయ్యడ దేవేంద్ర ఇటీవల గుండెపోటుతో మృతి చెందింది. ఈ మేరకు స్థానిక మాజీ సర్పంచ్ గోనె సుమలత నర్సయ్య, పెద్దపల్లి బ్రాంచ్ సేల్స్ ఆఫీసర్ బొద్దున రమేష్ చేతుల మీదుగా మంగళవారం నామినికి అందజేశారు. మృతి చెందిన కొయ్యడ దేవేంద్ర రూ.32,710లతో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ పొందివుండగా రూ.5 లక్షల 87 వేల 250 బీమా చెక్కును నామినీగా ఉన్న కొయ్యడ రాజకుమార్‌కు అందజేశారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ప్రతి ఒక్కరికి ఇన్సూరెన్స్ పాలసీ అవసరమని, సంపాదించే వయక్తులు ఏ కారణంగానైనా మృతి చెందితే వారి కుటుంబాల వారికి బీమా సొమ్ము ఆర్థిక తోడ్పాటు అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి బ్రాంచ్ మేనేజర్ వెంకట్ రాజం, మంచిర్యాల బ్రాంచ్ మేనేజర్ రాజు స్వాతి, ఎగ్జిగ్యూటీవ్ నూనె ప్రశాంత్, మహేందర్, డీఓ వడ్డకొండ వివేక్, చంద్రమౌళి, ఏజెంట్ లలిత, మాజీ సర్పంచ్ గోనె నర్సయ్య, కోఆప్షన్ మెంబర్ బల్ల రాజెల్లు గ్రామస్థులు పాల్గొన్నారు.

నిషేధిత గంజాయి పట్టివేత

నవతెలంగాణ-మందమర్రి

నిషేధిత గంజాయిని మంగళవారం మందమర్రి పోలీసులు పట్టుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని రైల్వే స్టేషన్ వద్ద 500 గ్రాముల నిషేధిత గంజాయి లభించింది. మందమర్రి సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ఆధ్వర్యంలో గంజాయిపై పెట్టిన నిఘాలో భాగంగా భగత్ సింగ్ నగర్‌కు చెందిన దేగల వివేక్ రాజ్ అలియాస్ విక్కి తండ్రి కృష్ణంరాజు, వృత్తి సీసీ కెమెరా టెక్నీషియన్ అనే వ్యక్తి మహారాష్ట్రలోని చంద్రాపూర్ నుంచి గంజాయి కొనుగోలు చేసి పట్టణంలో అమ్ముతున్నాడ అన్న సమాచారంతో మంగళవారం మందమర్రి రైల్వే స్టేషన్ వద్ద అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా అతని వద్ద 500 గ్రాముల గంజాయి దొరికింది. సతదరు వ్యక్తిపై కేసు నమోదుచేసినట్టు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు.

ప్లాస్టిక్ వాడే దుకాణాలకు జరిమానా



నవతెలంగాణ-నస్పూర్

ప్లాస్టిక్ వాడే దుకాణాలకు జరిమానాలు విధిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీష్ తెలిపారు. మంగళవారం నస్పూర్ మున్సిపల్ పరిధిలో గల పలు దుకాణాలను తనిఖీ చేయగా సూపర్ మార్కెట్‌లో ప్లాస్టిక్ వాడుతున్నందుకు రూ.1000 జరిమానా విధించారు. 120 మైక్రాన్‌ల కంటే తక్కువ మందము గల ప్లాస్టిక్ సంచులను, సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడకమును నిషేధించడం జరిగిందని, నస్పూర్ పట్టణ ప్రజలకు వివిధ వ్యాపార యజమానులు ప్లాస్టిక్ సంచులను, సింగిల్ యూస్ ప్లాస్టిక్ ను వాడకూడదని అన్నారు. ఈ కార్యక్రమములో మున్సిపల్ శానిటరీ ఇన్స్‌పెక్టర్ నరసింహులు, జూనియర్ అసిస్టెంట్ పి పవన్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ ప్రశాంత్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-జన్నారం



మండల కేంద్రంలోని స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పోన్కల్ పంచాయతీ ఈఓ రాహుల్ కోరారు. పోన్కల్ పంచాయతీ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఎండల తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా పట్టణ ప్రజలు చలివేంద్రాన్ని వినియోగించుకోవాలన్నారు.